సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 9 । ఆగస్టు । 2023



ముగిసిన పూజలు

ధర్మపురి: శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా సాగుతున్న మహారుద్ర పూజలు మంగళవారం ముగిశాయి.



మాటువేసి.. కత్తితో పొడిచి..

కోరుట్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం(45) మంగళవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యాడు.

8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

రెగ్యులర్ చేయాలని సీఎంకు పోస్టుకార్డులు



సుల్తానాబాద్ నుంచి పోస్ట్‌కార్డులు పంపిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

సుల్తానాబాద్: తమను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు సీఎం కేసీఆర్‌కు మంగళవారం పోస్టుకార్డులు పంపించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు స్వరూప ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. 2008లో రెండో ఏఎన్‌ఎంలను రోస్టర్ ప్రకారం ఉన్నతాధికారులు మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేశారని, అలాంటి వీరిని ఎన్‌హెచ్‌ఎం స్కీం కింద పనిచేస్తుండడంతో రెగ్యులర్ చేయబోమని మంత్రి హరీశ్‌రావు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని, ప్రభుత్వం తమపై వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కవిత, శారద, పద్మాంజలి, రాజు భాయ్, వీణ, రమాదేవి, భూలక్ష్మి, రాజేశ్వరి ఉన్నారు. ముందుగా ఆరోగ్య శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌ను బహిష్కరించారు.

సంపదవనాల్లో మొక్కల పరిశీలన



మొక్కలు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ

మంథని: మండలంలోని పార్వతీ బ్యారేజీ, సరస్వతీ పంపుహౌస్ ఆవరణలో సంపదవనాల్లో నాటిన మొక్కలను స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ మంగళవారం పరిశీలించారు. మరిన్ని మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించారు. గుంజపడుగు అటవీ స్థలాల్లో నాటిన మొక్కలను పరిశీలించారు. డీఆర్‌డీవో శ్రీధర్, డీఎఫ్‌వో శివయ్య, ఎంపీడీవో రమేశ్ ఉన్నారు.

సివిల్ సర్జన్‌గా కంది శ్రీనివాస్



శ్రీనివాస్‌రెడ్డి

మంథని: మంథని సామాజిక వైద్యశాల ఆస్పత్రి సూపరింటెండెంట్ (ప్రస్తుతం డెప్యూటి సివిల్ సర్జన్) కంది శ్రీనివాస్ రెడ్డి సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. ఆయనకు జిల్లా ప్రధాన ఆస్పత్రిలో పోస్టింగ్ ఇచ్చారు.

'సీఎంఆర్'పై నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: సీఎంఆర్ డెలివరీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సీఎంఆర్ పంపిణీపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో మంగళవారం సమీక్షించారు. గడువులోగా లక్ష్యం పూర్తి చేయాలన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి 62 రా రైస్ మిల్లులు ఇప్పటివరకు సీఎంఆర్ అందించలేదన్నారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్లు, మిల్లర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కమీషన్ పెంపు

- 413మంది డీలర్లకు లబ్ధి

సాక్షి, పెద్దపల్లి: రేషన్ డీలర్లకు ఇచ్చే కమీషన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో మెట్రిక్ టన్నుకు ప్రస్తుతం కమీషన్‌ను రూ.200 నుంచి రూ.1400కు పెంచుతున్నట్లు మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 413 మంది రేషన్ డీలర్లకు లబ్ధి చేకూరనుంది. అలాగే కరోనా సమయంలో మరణించిన డీలర్ల కుటుంబసభ్యులకు వారి స్థానంలో అవకాశం కల్పించనున్నారు. అలాగే రూ.5లక్షల బీమా, డీలర్లను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. వయోపరిమితిని 40 నుంచి 50 ఏళ్లకు పెంపు, అంత్యక్రియల నిర్వహణకు తక్షణ సాయంకింద రూ.10 వేలు, 1.5 క్వింటాళ్ల వేరియేషన్‌ను కేసుల పరిధి నుంచి తీసివేయడం వంటి తదితర 13 అంశాలపై ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేయటంతో డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





కన్నారం నుంచే జైత్రయాత్ర!



"పాత కరీంనగర్.. ఉద్యమాల ఖిల్లా. తెలంగాణ ఉద్యమానికి సమరశంఖం పూరించిన జిల్లా.. ఇక్కడే పార్టీ పునాదులు నిర్మితమయ్యాయి, ఇక్కడ నుంచే తెలంగాణ గళం ఢిల్లీకి వినిపించింది. రెండుసార్లు గులాబీ పార్టీ అధికారంలోకి రావడంలో కరీంనగర్ పాత్ర మరువలేనిది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 చొప్పున అసెంబ్లీ సీట్లు గెలుచుకున్నాం. ఈసారి 13 స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించాలి. జిల్లాలో పార్టీ గ్రాఫ్ బాగుంది. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నాం. చేసిన పని ప్రజలకు వివరించండి. ఉద్యమస్ఫూర్తితో ముందుకుపోదాం. ఎన్నికల జైత్రయాత్ర కరీంనగర్ నుంచే మొదలుపెడదాం. అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలన్నది సీఎం అభిలాష. ఇది పెద్ద కష్టమేమీ కాదు"

– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఉమ్మడి జిల్లా నేతలతో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చేసిన దిశానిర్దేశం

- 13 స్థానాలు కైవసం చేసుకోవాలె
- గత తప్పిదాలు పునరావృతం కావొద్దు
- ఉమ్మడి జిల్లా గులాబీ లీడర్లకు కేటీఆర్ దిశానిర్దేశం
- గంగుల, హరీశ్, వినోద్, భానుప్రసాద్‌కు అదనపు బాధ్యతలు
- పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెట్టిన అధిష్టానం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. దాదాపుగా చివరి అసెంబ్లీ సమావేశాలు కావడంతో మంత్రి గంగుల కమలాకర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు హైదరాబాద్‌లో విందు ఏర్పాటు చేశారు. కొంతకాలంగా చొప్పదండి, రామగుండం ప్రాంతాల్లో నేతలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్న వేళ ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. పాత కరీంనగర్ జిల్లాకే చెందిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ స్థితిగతులకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద ఉందని... ఎప్పటికపుడు తనకు పార్టీ గ్రాఫ్‌పై నివేదికలు అందుతున్నాయని మంత్రి కేటీఆర్ వారితో అన్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇంతకాలం ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ''మూడు గంటల కరెంటు'' వ్యాఖ్యలతో విశ్వసనీయత కోల్పోయిందని... బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు, విద్యా కానుక వంటి పథకాలతో ప్రజల్లో పార్టీ గ్రాఫ్ మరింత పెరిగిందని వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట అందరికీ సానుకూలంగానే ఉందని ప్రశంసించినట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణకు గుండెకాయ అయిన పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎలాగైనా 13 స్థానాలు గెలవాలని.. ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు.

నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలు..

హైదరాబాద్‌లో మంగళవారం మరో కీలక సమావేశం జరిగింది. ప్రతికూల అంశాలు పార్టీ విజయావకాశాలను ఏమాత్రం ప్రభావం చూపకుండా ఉండాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో మెరుగైనగ్రాఫ్ ఉన్న నాయకులను ఇతర నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా నియమించారు. కరీంనగర్‌లో బలమైన అభ్యర్థిగా ఉన్న గంగుల కమలాకర్ (62శాతం గ్రాఫ్)కు అదనంగా చొప్పదండి నియోజకవర్గం అప్పగించారు. మానకొండూరు బాధ్యతలను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌కు ఇచ్చారు. కీలకమైన హుస్నాబాద్ అసెంబ్లీకి మంత్రి హరీశ్‌రావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు అభ్యర్థుల బాధ్యతలను ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు అప్పగించారు. జగిత్యాల జిల్లా బాధ్యతలను మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ చూస్తారని తెలిసింది.

పెద్దపల్లి జిల్లాపై స్పెషల్ ఫోకస్..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో పాత జిల్లాలోని కరీంనగర్‌లో ఐదు (తర్వాతి కాలంలో హుజూరాబాద్ బీజేపీ వశమైంది), సిరిసిల్లలో రెండు, జగిత్యాలలో మూడుస్థానాలను బీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. కానీ...పెద్దపల్లిలో మాత్రం సీన్ రివర్స్ అయింది. అక్కడ మూడుస్థానాలకు ఒకటే గులాబీ పార్టీ గెలుచుకుంది. మంథనిలో శ్రీధర్‌బాబు (కాంగ్రెస్), రామగుండంలో కోరుకంటి చందర్ (ఏఐఎఫ్‌బీ)లు విజయం సాధించారు. వెంటనే కోరుకంటి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు కూడా పెద్దపల్లి జిల్లాలో మూడుస్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతుందన్న సమాచారంతో.. ఆ లోటును పూడ్చేందుకు ఎమ్మెల్సీ భానుప్రసాద్‌కు పార్టీ పెద్దపల్లి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

క్రమబద్ధీకరణ రుసుం వసూలుపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: భూముల క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి దరఖాస్తుదారుల నుంచి నిర్దేశించిన రుసుం వసూలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో జీఓ 59 భూముల క్రమబద్ధీకరణ, ఇంటిపట్టాల పంపిణీ, గృహలక్ష్మి పథకంపై అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌తో కలిసి మంగళవారం సమీక్షించారు. జీఓ 59 కింద తొలిదశ 664 మంది దరఖాస్తు చేసుకుని కేవలం 27 మంది మాత్రమే రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకున్నారని, మరో 10 మంది రెండువిడతలు చెల్లించారని, ఇంకా 627 మంది చెల్లించలేదని పేర్కొన్నారు. ఈనెల 10వరకు గృహ లక్ష్మి పథకం కింద దరఖాస్తులు స్వీకరించాల్సి ఉందన్నారు. తహసీల్దార్, మున్సి పల్, కలెక్టర్ కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీఓ మధుమోహన్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ పుష్పలత పాల్గొన్నారు.

మారుపేర్ల మార్పు అమలు చేయాలి



కార్మికులతో రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు మారుపేర్ల మార్పు అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ సూచించారు. సింగరేణి కార్మికుల ఆశీర్వాద యాత్రలో భాగంగా మంగళవారం ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–1, 3గని కార్మికులను కలుసుకున్నారు. డిపెండెంట్ల వయోపరిమితి 40ఏళ్లకు పెంచాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలోనే సింగరేణి లాభాల్లో కొనసాగిందని, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్థను దివాళా తీయస్తున్నాయని పేర్కొన్నారు. ఒక్క అవకాశమిస్తే ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తానన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, ఎండీ.ముస్తఫా, నాయకులు చుక్కల శ్రీనివాస్, తాళ్లపెల్లి యుగేందర్, వీరబోయిన రవియాదవ్, దూళికట్ట సతీష్, నజీమ్, సిరిశెట్టి సతీష్, ఉమ్మెత్తుల దేవేందర్ రెడ్డి, రాసమల్ల కిరణ్, శ్రీనివాస్, అక్షయ్, విజయ్, సోహైల్, గణపతి పాల్గొన్నారు.

సమయం లేదు మిత్రమా..!

- గృహలక్ష్మి, మైనార్టీబంధుకు సమీపించిన గడువు
- అర్హతలు కలిగిన వారు ఆగమాగం
- దరఖాస్తుదారులతో కార్యాలయాలు కిటకిట
- గడువు పెంచాలంటున్న జిల్లావాసులు
- మైనార్టీబంధుకు వచ్చిన దరఖాస్తులు 58

గృహలక్ష్మికి వచ్చిన దరఖాస్తులు నియోజకవర్గాల వారీగా..

కరీంనగర్	78
పెద్దపల్లి	1652
జగిత్యాల	274
సిరిసిల్ల	3495
మానకొండూరు	10
మంథని	617
హుజూరాబాద్	186
కోరుట్ల	766
వేములవాడ	2329
ధర్మపురి	566
చొప్పదండి	30
రామగుండం	1900



పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల సీజన్ వేళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు చేరవయ్యేందుకు ప్రజాకర్ష పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే దళితబంధు, బీసీలకు రూ.లక్ష సాయం ప్రకటించగా.. తాజాగా గృహలక్ష్మి పేరుతో నిరుపేదలకు గృహయోగం కల్పించేలా.. మైనార్టీబంధుతో ముస్లిం, క్రిస్టియన్ వర్గాలవారికీ ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వంద శాతం సబ్సిడీతో మూడు విడుతల్లో సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు నిర్మించుకోవచ్చు. అదే మైనార్టీబంధులో వన్‌టైం గ్రాంట్ కింద కుటుంబంలో ఒకరికి రూ.లక్ష అందించనున్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులు అన్నిరకాల ప్రయత్నాలూ చేస్తున్నారు. వీరి అవకాశాన్ని మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధిక చార్జీలు తీసుకుంటూ వారి వెన్ను విరుస్తున్నారు. ఈ రెండు పథకాలకు దరఖాస్తు గడువు దగ్గరపడుతుండటంతో దరఖాస్తుదారులు సమయంలేదని అధిక చార్జీలైనా చెల్లిస్తున్నారు.

గృహలక్ష్మి నిబంధనలు

- ఇళ్లు లేకుండా సొంత జాగా ఉండి నిర్మాణం చేసుకునేవారు
- స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు
- తెల్ల రేషన్‌కార్డు కచ్చితంగా కలిగివుండాలి
- కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసు బుక్ జిరాక్స్‌లు జతపర్చాలి
- జీవో 59 కింద లబ్ధిపొందని వారు మాత్రమే అర్హులు

మైనార్టీబంధు నిబంధనలు

- దరఖాస్తుదారులకు వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణాల్లో రూ.రెండు లక్షలకు మించరాదు
- 2023 జూన్ 2వ తేదీ నాటికి 21నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు గలవారై ఉండాలి
- తహసీల్దార్ జారీచేసిన బీసీ సీ, చర్చి పాస్టర్ మంజూరు చేసిన బాపిస్ట్ సర్టిఫికెట్ తప్పనిసరి
- ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు
- కులం, ఆదాయం, నివాసం ధ్రువప్రతాలు తప్పనిసరి
- మంత్రి ఆమోదంతో జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ ఎంపిక చేసి మైనార్టీశాఖ ద్వారా అందిస్తారు.

గృహలక్ష్మికి రేపటితో.. మైనార్టీబంధు 14 వరకు గడువు

గూడు నిర్మించుకోవాలని ఎన్నో రోజులుగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటన జారీ చేశారు. దీంతో వివిధ ప్రాంతాల్లో పనుల కోసం వెళ్లినవారు, స్థానికంగా ఉంటున్న వారు ఆయా పత్రాలు సమకూర్చుకోవడానికి పరుగులు పెడుతున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు కాకుండా కలెక్టరేట్, మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు నేరుగా అందించాలనడంపై దరఖాస్తుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మైనార్టీబంధుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వరకు గడువు ఇచ్చారు. దాని గడువు మరో ఐదు రోజులే ఉండటంతో మైనార్టీలు ఆందోళన చెందుతున్నారు. సరైన సమాచారం లేక ఎవరు ఏం చెబితే వాటికోసం పరుగులు తీస్తూ ఆగమాగం అవుతున్నారు. మీసేవ కేంద్రాల్లో కులం, ఆదాయం, తదితర సర్టిఫికెట్ల కోసం బారులు తీరుతున్నారు. మద్యం దుకాణాల్లో టెండర్లు వేయడానికి కులం సర్టిఫికెట్ అవసరం కావడంతో వారు కూడా పరుగున వస్తుండటంతో రద్దీ పెరుగుతోంది. ఇదే అదనుగా మీసేవ కేంద్రాల నిర్వాహకులు అధికచార్జీలు వసూలు చేస్తున్నారు.

ముంపు ఇళ్లను పరిశీలించిన త్రీమెన్ కమిటీ



గ్రామస్తులతో త్రీమెన్ కమిటీ సభ్యులు

ధర్మారం: నందిమేడారం రిజర్వాయర్ నీటితో ముంపునకు గురవుతున్న మండలంలోని చామనపల్లిలోగల ఇళ్లను జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆధ్వర్యంలో త్రీమెన్ కమిటీ సభ్యులు మంగళవారం పరిశీలించారు. కమిటీ సభ్యులైన నీటిపారుదలశాఖ ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, ఆర్‌అండ్ఆర్ కమిషనర్ కార్యాలయం ప్రతినిధి రూపస్‌దత్తం, భూసేకరణ అడిషనల్ కలెక్టర్ గౌరీశెట్టి మునిందర్, నీరుపారుదలశాఖ ఈఈ నూనె శ్రీధర్, నర్సింగరావు, విష్ణు గ్రామానికి చేరుకుని గతంలో ముంపునకు గురవుతాయని మార్కింగ్ చేసిన ఇళ్లను పరిశీలించారు. ఫుల్ రిజర్వాయర్ లెవెల్ (ఎఫ్ఆర్ఎల్)వంద మీటర్ల వరకు ముంపునకు గురవుతున్న ఇళ్లతోపాటు ఇటీవల వర్షాలకు ముంపునకు గురైన వీధుల్లో పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు దాసరి తిరుపతి అధ్యక్షతన గ్రామస్తులతో సమావేశమయ్యారు. ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్‌లోకి వరదనీరు చేరితే బ్యాక్ వాటర్ ఇళ్లలోకి వస్తోందని ప్రజలు త్రీమెన్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. అదే సమయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ జేసీతో మాట్లాడి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ముంపునకు గురవుతున్న ఇళ్లను సర్వే చేస్తామని, గ్రామస్తులు సహకరించాలని జేసీ కోరారు. వంద మీటర్ల వరకు ముంపునకు గురవుతున్న ఇళ్లను వెంటనే సర్వే చేస్తామని, ఇందులో గ్రామం మొత్తంలో ఎంతశాతం ముంపునకు గురవుతున్నాయని నిర్ధారణకు వచ్చిన తర్వత మిగతా ఇళ్ల గురించి ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు. గ్రామంలో 70 శాతం ఇళ్లు ముంపునకు గురవుతే గ్రామం మొత్తానికి పరిహారం అందించే అవకాశముంటుందని వెల్లడించారు. సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, ఎంపీటీసీ సూరమల్ల శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ పాలమాకుల తిరుపతిరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, పంచాయతీ కారదర్శి తిరుపతి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలిచి అధికారంలోకి రావాలని, అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రజలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. వారు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్



ఎలిగేడులో ప్రచారం చేస్తున్న విజయరమణారావు

ఎలిగేడు: పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ, పల్లెపల్లెకూ విజ్జన్న కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చాక ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర రెడ్డి, అర్షనపెల్లి వెంకటేశ్వర రావు, కోరుకంటి వెంకటేశ్వరరావు, దుగ్యాల సంతోష్ రావు, సింగిరెడ్డి రాంచందర్ రెడ్డి, తాటికొండ రమేశ్‌బాబు, అమ్ముల రమేష్, అమ్ముల శ్రీను, కొండ తిరుపతి, రంగు శ్రీను, జాని, విక్రమ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులతో కలిసి మెలిసి


మహిళా రైతులతో డీసీసీ అధ్యక్షుడి సతీమణి మనాలిఠాకూర్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి, మద్దిర్యాల, పాట్యాల తదితర గ్రామాల్లో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పర్యటిస్తూ పంట పొలాల్లో మహిళా రైతులతో కలిసి కష్టసుఖాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతు రాజ్యం వస్తుందంటూ రైతాంగానికి ప్రకటించిన మేనిఫెస్టోను వివరించారు. ఆమెతో కాంగ్రెస్ ప్రతినిధులు గాదె సుధాకర్, మడ్డి తిరుపతిగౌడ్, కోల రమేశ్, ఆకుల రామ్, అర్శనపల్లి శ్రీనివాస్, దొరిశెట్టి రాజేందర్, దామోదర్, దర్శనాల రాజశేఖర్ తదితరులున్నారు.

గద్దర్‌కు గని కార్మికుల నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: ప్రజాకవి, విప్లవ గాయకుడు గద్దర్‌కు గని కార్మికులు మంగళవారం ఘన నివాళులర్పించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్జీ–1 ఏరియాలోని గనులపై గద్దర్ ఫ్లెక్సీకి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అధికారులు. కార్మికులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం


నారాయణ(ఫైల్)

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన మాజీ సింగరేణి కార్మికుడు తొటం నారాయణ(65) మంగళవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్‌తో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. సమాజ హితం కోసం ఆలోచించి ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించాలనే ఉద్దేశ్యంతో నారాయణ నేత్రాలను దానం చేసిన భార్య రాజేశ్వరి, కూతురు చంద్రకళ, అల్లుడు శంకర్, లలిత, సత్యనారాయణ, యమున, స్వప్న–రాజేశ్‌లను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

రామగుండం రైల్వేస్టేషన్ సందర్శన

రామగుండం: అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌గా గుర్తించిన రామగుండం స్టేషన్‌ను మంగళవారం రైల్వే చీఫ్ ఆపరేషన్ మేనేజర్ నాగ్య సందర్శించారు. ఈ సందర్భంగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్స్ కల్పించాలని రైల్వే ప్రజాసంబంధాల మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ వినతిపత్రం అందించారు. వెంకటేష్, జబ్బార్, బాబా తదితరులున్నారు.

మాటు వేసి.. కత్తితో పొడిచి..

- కోరుట్లలో బీఆర్‌ఎస్ నేత దారుణ హత్య
- ముసుగులు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు
- హోటల్‌లో టీ తాగుతుండగా లక్ష్మీరాజంపై దాడి
- తీవ్రగాయాలతో కరీంనగర్ ఆస్పత్రిలో మృతి


లక్ష్మీరాజం మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


లక్ష్మీరాజం(ఫైల్)

జగిత్యాలక్రైం: మంగళవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రశాంతంగా ఉన్న కోరుట్ల క్రిస్టియన్ కాంపౌండ్ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.. ముసుగులు ధరించి మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు.. మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం(45)పై కత్తితో దాడి చేయడంతో స్థానికులు భయంతో పరుగులు పెట్టారు. దుండగులు ఆయన మెడపై మూడు సార్లు గట్టిగా పొడిచారు.. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీరాజంను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. ఈఘటనతో కోరుట్ల పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పథకం ప్రకారమే హత్య..

పోగుల లక్ష్మీరాజం – పోగుల ఉమారాణి దంపతులు.బీఆర్‌ఎస్‌కు చెందిన లక్ష్మీరాజం కౌన్సిలర్‌గా గతంలో సేవలు అందించారు. ఆయన భార్య ప్రస్తుతం తొమ్మిదోవార్డు కౌన్సిలర్. లక్ష్మీరాజం రోజూ ఉదయం 9గంటలకు క్రిస్టియన్ కాంపౌండ్ సమీపంలోని పోగుల శంకర్ హోటల్‌కు వెళ్లి టీ తాగుతారు. ఆయన కదలికలను ఇద్దరు దుండగులు కొద్దిరోజులుగా గమనిస్తున్నారు. టీ తాగి కూర్చున్న లక్ష్మీరాజం వద్దకు మోటార్‌సైకిల్‌పై మాస్క్ పెట్టుకుని వచ్చిన ఇద్దరు 'అన్నా' అని పిలిచారు. అతడి దగ్గరకు వెళ్లి వెంటనే కత్తితో మెడపై మూడుసార్లు పొడిచారు. లక్ష్మీరాజం గట్టిగా కేకలు వేశారు. టీ తాగేందుకు వచ్చిన వారు భయపడి దూరంగా పారిపోయారు. దుండగులు మోటారు సైకిల్‌పై తప్పించుకుపోయారు. తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీరాజంను తొలుత స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

కోరుట్లలో ఉద్రిక్తత..

లక్ష్మీరాజంపై దాడి విషయం తెలియడంతో కోరుట్లలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతుడి బంధువులు, అనుచరులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కరీంనగర్ నుంచి మృతదేహం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం చేశారు. బంధువులు, అనుచరులు ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. హంతకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణధ్యక్షుడు అన్నం అనిల్ సర్ది చెప్పారు. లక్ష్మీరాజంకు కొడుకు, కూతురు ఉన్నారు.

పాత కక్షలేనా?

లక్ష్మీరాజం హత్యకు పాత కక్షలే కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్నెల్ల క్రితం ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ హత్య కేసులో లక్ష్మీరాజం అనుచరులుగా చెబుతున్న వారు పాలుపంచుకున్నారు. దీంతో ఆయన హత్య వెనుక లక్ష్మీరాజం హస్తం ఉందని భావించి ప్రవీణ్‌సింగ్ సన్నిహితులు, అన్నదమ్ములైన విత్తనాల నాగరాజు(30), త్రిమూర్తులు(28).. కలిసి పథకం ప్రకారమే పోగుల లక్ష్మీరాజం హత్య చేశారని పోలీసులకు కొన్ని ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ ఇద్దరికి మల్లాపూర్ ప్రాంతానికి చెందిన పిల్లి సత్యనారాయణ, కోరుట్లకు చెందిన వంశీ సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతోపాటు రాజకీయ కక్షలతో ఎవరైనా హత్యకు సుపారీ ఇచ్చారా? అనే సందేహాలూ ఉన్నాయి.

దుండగుల గుర్తింపు..

లక్ష్మీరాజం హత్యలో విత్తనాల నాగరాజు, విత్తనాల త్రిమూర్తులు, పిల్లి సత్యనారాయణ, వంశీ పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్నామని, వారిని పట్టుకునేందుకు ఐదు పోలీసు బృందాలు గాలిస్తున్నాయని డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నిందితులిద్దరూ మోటారు సైకిల్‌పై పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితులు వాడిన మోటార్‌సైకిల్ వంశీదని సమాచారం. సోమవారం రాత్రి వంశీ నుంచి నిందితులు దానిని తీసుకున్నట్లు తెలిసింది. ఆర్నెల్ల క్రితం హత్యకు గురైన ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ ఈ మోటార్‌సైకిల్‌ను వంశీకి ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం విత్తనాల నాగరాజు, వంశీ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వీరిద్దరూ ఇప్పటికే రెండు, మూడు హత్య కేసుల్లో నిందితులని పోలీసు రికార్డుల్లో ఉంది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హంతకులను కఠినంగా శిక్షించాలని యువకులు కార్గిల్ చౌరస్తా వద్ద సుమారు గంట పాటు రాస్తారోకో చేశారు. ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నింధితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వటంతో యువకులు ఆందోళన విరమించారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

- సిరిసిల్లలో మాజీ సర్పంచుల నిరవధిక దీక్షలు ప్రారంభం


దీక్షలో మాట్లాడుతున్న దేవయ్య

సిరిసిల్లటౌన్: తమ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో నిరవధిక దీక్షలను హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్ ప్రారంభించారు. అనంతరం దేవయ్య మాట్లాడుతూ, మాజీ సర్పంచులందరికీ నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని, అర్హులకు డబుల్ బెడ్రూం, హెల్త్‌కార్డులు, బస్‌పాస్‌లు ఇవ్వాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని, సర్పంచులు, మాజీ సర్పంచులు మృతిచెందితే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించి రూ.5లక్షలు ఆర్థికసాయం చేయాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ భవనాలు కట్టించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, సంభసూరి మల్లేశం, జనగామ నర్సింగరావు, గుర్రం భూపతిరెడ్డి, మ్యాకల శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేశం, గంగస్వామి, సలీం, నారాయణ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పటిక పట్టివేత


స్వాధీనం చేసుకున్న పటిక

పాలకుర్తి: గుడుంబా తయారీలో వినియోగించే పటికను అక్రమంగా తరలిస్తున్న ముద్దంగుల శ్యాంను మంగళవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని పటికతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బసంత్‌నగర్‌కు చెందిన శ్యాం మహారాష్ట్రలోని వీరూర్ నుంచి కొంతకాలంగా పటికను అక్రమ రవాణా చేస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేసి కేసులు నమోదు చేస్తుండటంతో ధర్మపురి నుంచి పటికను అక్రమంగా తీసుకొచ్చి గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్నాడు. మంగళవారం ధర్మపురిలోని ఇమ్మడి రాజన్న నుంచి 60 కిలోల పటికను కొనుగోలు చేసి బసంత్‌నగర్‌కు తీసుకొస్తుండగా రామగుండం ఎక్సైజ్, పెద్దపల్లి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం సంయుక్తంగా శ్యాంను పట్టుకొని బైక్‌తో పాటు పటికను స్వాధీనం చేసుకున్నారు. శ్యాంను పాలకుర్తి తహసీల్దార్ జ్యోతి ఎదుట బైండోవర్ చేశారు. స్వాధీనం చేసుకున్న పటిక విలువ రూ.6వేలు, బైక్ విలువ రూ.50వేలు ఉంటుందని సీఐ రమేశ్ వివరించారు.

ప్రమాదానికి కారణమైన కారు గుర్తింపు

మంథని: మంథని మండలం ఎక్లాస్‌పూర్ శివారులోని గాడుదుల గండి ఘాట్‌పై ఆదివారం నడుచుకుంటూ వెళ్తున్న మల్ల సంపత్‌రెడ్డిని ఢీకొట్టి ఆయన మృతికి కారణమైన కారును గుర్తించినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. గోదావరిఖని నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొయ్యూర్‌కు ఎస్సై నరేశ్ ప్రైవేటు డ్రైవర్ రోహిత్ కారు నడుపుతుండగా వెళ్లాడన్నారు. ఈమేరకు కారును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం షాపులకు 26 టెండర్లు

సాక్షి, పెద్దపల్లి: మూడు నెలల ముందుగానే ఎక్సైజ్ నూతన పాలసీని అమల్లోకి తీసుకొచ్చిన ప్రభుత్వం 2023–25 సంవత్సరానికి టెండర్లను ఆహ్వానించింది. ఈ ఏడాది డిసెంబర్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే 77 మద్యం దుకాణాలకు ఇప్పటివరకు కేవలం 26 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం ఆశించినంత దరఖాస్తులు రావటం లేదని, చివరి రెండు రోజుల్లో భారీగా వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు చెప్పుతున్నారు.

ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసాలు


సాధనాశూరుల సాహస విన్యాసాలు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో మంగళవారం చల్లూరుకు చెందిన చింతకింది మార్కండేయ సాధనాశూరుల బృందం సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఓం.. హ్రీం.. అంటూ ఇంద్రజాల ప్రదర్శనల వలె కళ్లకు కట్టినట్టుగా ఉన్నది లేనట్టు..లేనివి ఉన్నట్లు మన కళ్లను మనమే నమ్మలేని విధంగా సాహస ప్రదర్శనలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వెంగళ పద్మలత, బాపు, బొద్దున శ్రీనివాస్‌తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో మంగళవారం ఓ రైతు గుండెపోటుతో పొలంలోనే పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బోకూరి రమేశ్‌రెడ్డి(45) మంగళవారం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. విద్యుత్ మోటారు ఆన్ చేసేందుకు ఒడ్డుపై నుంచి నడిచివెళ్తున్నక్రమంలో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో పొలంలోనే పడిపోయాడు. వెంటనే సమీపంలో ఉన్న తండ్రి చంద్రారెడ్డి వచ్చి పరిశీలించగా మృతిచెందాడు. సమాచారం అందుకున్న భార్య సుజాత అక్కడికి వచ్చి భర్త మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అనంతరం స్థానికుల సాయంతో రమేశ్‌రెడ్డి మృతదేహాన్ని పొలంలోనుంచి ఇంటికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి కొడుకు ప్రశాంత్, కూతురు లహరి ఉన్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తన

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఆదివారం సాయంత్రం బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు బాలురపై కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ కుటుంబం ఇటీవల ఆ గ్రామానికి వలస వచ్చింది. ఆదివారం సాయంత్రం బాలిక బయటకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు అసభ్యకరంగా ప్రవర్తించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన నల్ల నర్సమ్మ (75) వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సమ్మ గ్రామశివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. బంధువులు మంగళవారం వృద్ధురాలి కోసం వెతకగా బావిలో శవమై కనిపించింది. మృతురాలి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

పూడూర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

కొండగట్టు(చొప్పదండి): మండలంలోని పూడూర్ గ్రామ సింగిల్‌విండో వైస్ చైర్మన్ సావనపల్లి రమేశ్‌పై డైరెక్టర్లు మంగళవారం అవిశ్వాస తీర్మానం చేశారు. ఈమేరకు డీసీవో రామానుజచారికి 12 మంది డైరెక్టర్ల సంతకాలతోకూడిన లెటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ రమేశ్ అవకతవకలకు పాల్పడుతున్నాడని, వ్యక్తిగత ప్రయోజనాల దృష్ట్యా పదవిని దుర్వినియోగం చేస్తున్నాడని లెటర్‌లో పేర్కొన్నారు.

బొగ్గుబాయి

స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఆర్జీ–1 ఏరియాలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగుల సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎవరికి కేటాయించిన పనులను వారే బాధ్యతాయుతంగా నిర్వహించి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, డీజీఎం (పర్సనల్) సీహెచ్ లక్ష్మీనారాయణ, ఏజీఎం (సివిల్)నవీన్, ఏజీఎం(ఐఈడీ) ఆంజనేయులు, డీజీఎం (ఏరియా వర్క్‌షాప్) మధన్‌మోహన్, డీజీఎం(టీటీసీ)వెంకటరమణ, ఎన్వీరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఫారెస్ట్ అధికారి అభిలాష్, పర్చేస్ అధికారి శ్రీనివాస్, సీనియర్ పీవో బంగారు సారంగపాణి, శ్రావణ్‌కుమార్, అకౌంట్స్ అధికారి శ్రీహర్ష అధికారులు పాల్గొన్నారు.

రక్షణతో ఉత్పత్తి సాధించాలి

రక్షణతో ముందుకు సాగి ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య అన్నారు. మంగళవారం జీడీకే–1, 3 గనులపై నిర్వహించిన భద్రతా అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. నాభద్రత నా బాధ్యత, నా భద్రత నా కుటుంబ భద్రత అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్స్ అమలు చేసి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏరియా సేఫ్టీ అధికారి బండి సత్యనారాయణ, ఏజెంట్ బానోతు సైదులు, మేనేజర్ రమేశ్ బాబు, సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లర్ల స్థిరత్వంపై శాస్త్రీయ అధ్యయనం


మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌డీ జీఎం సుబానీ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–2, 2ఏ గనిలో పిల్లర్ల స్థిరత్వంపై మంగళవారం హెచ్‌ఆర్‌డీ జీఎం సుబానీ అధ్యయనం, సమీక్ష సమావేశం నిర్వహించారు. కంటిన్యూస్‌మైనర్‌లో ఓబీ డంప్‌యార్డు కింద ఉన్న పిల్లర్ల పటుత్వం కోసం 150 మీటర్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏజెంట్ సైదులు, మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'ఖని' కళాకారుడికి జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సందీప్‌కుమార్

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని జవహర్‌నగర్‌కు చెందిన శ్రీసంతోషి ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు ఒడ్డేపల్లి బానయ్య కుమారుడు సందీప్‌కుమార్‌కు జాతీయస్థాయి జానపద కళారత్న పురస్కారం లభించింది. మేకప్‌మెన్, డ్యాన్స్ మాస్టర్, వాయిద్య కళాకారుడిగా రాణిస్తున్న సందీప్‌కుమార్‌కు ఇటీవల న్యూఢిల్లీలోని తెలంగాణభవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన తార ఆర్ట్స్ అకాడమీ అవార్డుల ప్రదానోత్సవంలో పురస్కారాన్ని అందజేశారు. అలాగే ఇదే టీంలో కళాకారులుగా రాణిస్తున్న పానుగంటి రవి, మూగ రవీందర్, మద్దెల దివాకర్, సింగరవేణి మల్లేష్‌యాదవ్‌లకు కూడా జాతీయస్థాయి అవార్డు దక్కింది.

సీపీఎస్ రద్దుకు దశలవారీగా ఉద్యమాలు


కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

ఓదెల: సీపీఎస్ రద్దుకు యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడుతున్నట్లు డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ అమృతకిశోర్ అన్నారు. మంగళవారం ఓదెలలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. సీపీఎ రద్దుకు ఈనెల 12న జిల్లా కేంద్రాల్లో, సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు, 317జీవో బాధితుల అంశం, బదిలీలు, పదోన్నతులు, పీఆర్‌సీ, ఈహెచ్‌ఎస్ ఖాళీల భర్తీ, నూతన జాతీయ విధానం రద్దు, స్కావెంజర్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం తాత్సార్యం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకుడు కొంపెల్లి లక్ష్మణ్, డీటీఎఫ్ నాయకులు చంద్రమౌళి, శ్రీనివాస్, కిరణ్, గట్టయ్య, శోభారాణి, సుమలత, వివేక, మాధవిలు పాల్గొన్నారు.

వెంకటాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు


బైక్‌పై నుంచి కింద పడ్డ వెంకటి, వెంకటేశ్

- బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- తృటిలో తప్పిన పెను ప్రమాదం

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ శివారు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, 20 మందికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. వెంకటాపూర్‌కు చెందిన తండ్రి కొడుకులు సోమిశెట్టి వెంకటి, వెంకటేశ్‌లు బైక్‌పై జగిత్యాల నుంచి వెంకటాపూర్ వెళ్తున్నారు. ఈక్రమంలో వెంకటాపూర్ గ్రామ శివారులో బైక్‌ను ఒక్కసారిగా మళ్లించడంతో ఎదురుగా వస్తున్న బస్సు బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఆగింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. తృటిలో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి స్వల్పగాయాలు కావడంతో కోరుట్ల ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



'గృహలక్ష్మి' తిప్పలు



మహిళల పేరిట స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3లక్షల సాయాన్ని గృహలక్ష్మి పథకం కింద అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెల్సిందే. గ్రామీణులు తహసీల్దార్ కార్యాలయంలో.. బల్దియా ప్రజలు మున్సిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించేలా ఏర్పాట్లు చేసింది. ఈనెల 10వరకే గడువు ఉండడంతో జనాలు ఇలా మీసేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల వద్ద బారులు తీరి కనిపిస్తున్నారు. గృహలక్ష్మి దరఖాస్తు ఫారాలు నింపుతూ కొందరు, స్పెషల్ కౌంటర్‌లో అందిస్తూ మరికొందరు సాక్షికి కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి